# కొత్త సైకిల్

- శ్రీప్రసాద్

“నా సైకిల్ ఎవరో ఎత్తుకుపోయార్రా” అన్నాడు శ్రీరాం ఏడుపు ముఖం పెట్టుకుని.

“ఎంత శుభవార్త చెప్పావురా. కంగ్రాట్యులేషన్స్” అన్నాడు చక్రి.

“ఏంట్రా సైకిల్ పోయిందని నేనేడుస్తుంటే నీకది శుభవార్తా!” కోపంగా చూశాడు శ్రీరాం.

“మరి! ఆ డొక్కు సైకిల్ పోతే అంత బాధపడడం ఎందుకురా? పోతే పోయిందిలే వెధవ సైకిల్. అయినా ఆ ఎత్తుకుపోయిన దొంగెవడో గానీ వాడిని తలచుకుంటూనే ఎంతో జాలిగా ఉందిరా. ఇంత పెద్ద పట్టణంలో మరో సైకిల్ ఏదీ దొరకనట్లు నీ సైకిలే దొరికిందా ఆ దరిద్రుడికి” నవ్వాడు చక్రి.

“నీకు నవ్వులాటగానే ఉంటుందిలేరా. ఆ సైకిల్ నాకెంత సర్వీస్ చేసిందో తెలుసా?”

“నీకేకాదు లేరా! నీకు ముందు మీ నాన్నకు, మీ నాన్నకు ముందు మీ తాతకు ఆయనకు ముందు భారతదేశాన్ని పరిపాలించిన మొగలాయి చక్రవర్తులకు కూడా ఆ సైకిల్ చాలా సర్వీస్ చేసిందట గదా. అసలు నాదిర్‌షా భారతదేశంపై దండెత్తి కోహినూర్ వజ్రం, నెమలి సింహాసనం దోచుకుపోయాడు కదా!

వాటితోపాటు ఈ సైకిల్‌ను కూడా దొంగిలించుకుపోవాలని చూశాడట కదా. అయితే మొగలాయి చక్రవర్తులు మాత్రం కోహినూర్ వజ్రం పోయినా ఫర్వాలేదు, నెమలి సింహాసనం పోయినా ఫర్వాలేదు. కానీ ఈ సైకిల్ మాత్రం ఎటువంటి పరిస్థితులలోనూ, చివరకు ప్రాణాలు పోయినా అతనికి దొరకకుండా చేయాలని కాపాడబట్టి పోకుండా మిగిలిందట కదా! ఆ తర్వాత ఆ చేయి ఈ చేయి మారి చివరకు మీ తాతకు ఎలాగో దక్కిందట గదా! మన హిస్టరీ లెక్చరర్ చెప్పాడు. అంత విలువైన సైకిల్ పోయిందంటే కాస్త బాధగానే ఉంటుంది. కాకపోతే కనీసం ఈనాటికైనా ఆ సైకిల్‌కు నీనుంచి విముక్తి కలిగినందుకు ఓ పక్క సంతోషంగా కూడా ఉంది” చక్రి నవ్వు ఆపుకోవడానికి సతమతమయ్యాడు.

“నోరుముయ్యరా. నా సైకిలంటే అంత వేళాకోళంగా ఉందా నీకు?” కోపగించుకున్నాడు శ్రీరాం.

“వేళాకోళం కాదురా బాబూ! నిజంగానే చాలా బాధగా ఉంది”

ఇక నవ్వాపుకోవడం అతని తరం కాలేదు. పొట్ట పట్టుకుని కళ్లల్లో నీళ్ళు కారేట్టు నవ్వేశాడు. అతని నవ్వు చూసి శ్రీరాం ఉడుక్కుని అక్కడ నుంచి విస విస వెళ్ళిపోయాడు.

★ ★ ★

ఆ సాయంత్రం నటరాజ్ టీ సెంటర్‌కు నడిచి వచ్చిన శ్రీరాంను అంతదూరంలో చూడగానే పెద్దగా అన్నాడు హరి. “ఒరేయ్! ఈరోజు శ్రీరాం మనకు మంచి పార్టీ ఇవ్వబోతున్నాడు” అని.

“శ్రీరామా? పార్టీనా? ఎందుకురా?” అమాయకంగా ముఖం పెట్టి అడిగాడు రఘు.

“నీకీ విషయం తెలియదట్రా! శ్రీరాం గాడి బిసి కాలం నాటి సైకిల్‌ను ఎవరో దొంగలెత్తుకుపోయారట!” చెప్పాడు గిరి.

స్నేహితులందరూ పెద్ద పెట్టున నవ్వారు.

శ్రీరాం, అతని స్నేహితులు ప్రతిరోజు సాయంత్రం పూట బజార్లో నటరాజ్ టీ సెంటర్లో కలుసుకుని పిచ్చాపాటీ కబుర్లతో కాలం గడపడం అలవాటు. ఆరోజు కూడా అలవాటుగా అక్కడకు వచ్చిన స్నేహితుల కామెంట్లు విని మండుకొచ్చింది.

ఇంతలో భాస్కర్ శ్రీరాం దగ్గరకు వచ్చి “ఒరేయ్ శ్రీరాం! తొందరపడి పార్టీ ఇచ్చేయకురోయ్. ఆ సైకిలెత్తుకు వెళ్ళిన దొంగ చచ్చినోడెవరో గానీ ఈ పాటికి దాని తడాకా తెలుసుకుని గుట్టుగా ఎత్తుకొచ్చి మీ ఇంటి వాకిట పెట్టేసి వెళ్లవచ్చు. కొద్దిరోజులు ఆగు. ఇక సైకిల్ ఎటువంటి పరిస్థితులలోనూ తిరిగి రాదని నిర్ధారణ అయ్యాకే పార్టీ ఇవ్వొచ్చు” అన్నాడు.

మరోసారి మిత్రులందరూ గొల్లుమని నవ్వారు.

శ్రీరాంకు భాస్కర్‌గాడి గొంతు కొరికేయాలని అనిపించింది. అయినా కోపాన్నెలాగో తమాయించుకుని “అనరా అను. ఆ సైకిల్ వల్లనే నువ్వు ఐ.సెట్‌లో గట్టెక్కావన్న విషయం మర్చిపోకు” అన్నాడు పళ్ళు కొరుకుతూ.

“కాదననురా బాబూ! ఆ సైకిలే లేకపోతే ఆ రోజు ఎగ్జామ్ సెంటర్‌కు సకాలంలో వెళ్ళి ఉండగలిగే వాడిని కాదు. అయితే ఆ సైకిల్ వల్లనే నాకూ టాప్‌ర్యాంకు మిస్సయిందన్న విషయం నీకు తెల్సా? తెలిసుండదు. ఎందుకంటే నువ్వు బాధపడతావని ఆ విషయం ఇంతవరకూ నేను నీకు చెప్పలేదు కదా!అబ్బబ్బ..ఏం సైకిల్‌రా బాబూ అది! ఆరోజు ఎలాగో సకాలంలో పరీక్ష హాల్కైతే చేరగలిగాను గానీ...పరీక్ష రాయడం మాత్రం సకాలంలో ప్రారంభించలేకపోయాను. ఆ సైకిల్ తొక్కుకుని వెళ్ళేసరికి ఆయాసం, గుండెదడ వచ్చి అరగంటసేపు పరీక్ష మొదలుపెట్టలేకపోయాను తెల్సా”

ఇంతలో కుమార్ కలగజేసుకున్నాడు.

“ఛ! కాసేపు ఊరుకోండ్రా. నాకు తెలిసి అటువంటి సైకిల్ ఇండియాలోనే కాదు, యావత్ ప్రపంచంలోనే దొరకదు. ఓసారి అవసరమై రెండ్రోజుల పాటు ఆ సైకిల్‌ను నా దగ్గర అట్టేపెట్టుకుని వాడాను. ఆ రెండ్రోజుల్లోనే నా బరువు నాలుగు కిలోలు తగ్గాను. గంటకు రెండు వందల కిలోమీటర్ల వేగంతో సైకిల్ తొక్కితే రెండుకిలోమీటర్ల వేగంతో కదిలే సైకిల్ అదొక్కటే. మీకో విషయం తెల్సా? మన శ్రీరాం గాడు అడ్డమైన చెత్త తిన్నా కూడా ఇలా స్లిమ్‌గా ఉన్నాడంటే కారణం ఏమిటనుకున్నారు? ఆ సైకిలే” అది కుమార్ ఉవాచ.

“అంత గొప్ప సైకిలా అది?” అమాయకంగా మొహం పెట్టి అడిగాడు రఘు.

“మరేమనుకున్నావ్? ఆ సైకిల్‌ను నేనే శ్రీరాం దగ్గర్నుంచి కొనేసి ఓ ఒబేసిటీ క్లినిక్ పెట్టాలని ప్లాన్ కూడా చేశా. ప్చ్...బంగారంలాంటి సైకిల్. ఏ దొంగ వెధవ ఎత్తుకుపోయాడో?” బాధగా మొహం పెట్టి రుమాలుతో కళ్ళు తుడుచుకున్నట్లు అభినయించాడు కుమార్.

“అయితే ఈపాటికి ఆ సైకిల్ మహత్యం తెలుసుకున్న ఆ దొంగోడు ఆ సైకిల్‌ను ఏ అమెరికాకో, యూరప్‌కో స్మగుల్ చేసుండొచ్చు” అన్నాడు గిరి.

మళ్ళీ అందరూ గొల్లున నవ్వారు.

శ్రీరాంకు అర్థమైంది. వాళ్ళు తనను మోచేస్తు న్నారని. ఇక అక్కడ ఎక్కువ సేపు ఉండడం అంత శ్రేయస్కరం కాదు. ఫ్రెండ్సంతా కలిసి తనను ఆట పట్టించే ప్రోగ్రాం పెట్టుకున్నట్టుంది అని గ్రహించి అక్కడినుంచి చల్లగా జారుకున్నాడు శ్రీరాం.

★ ★ ★

"ఏమోయ్! సైకిల్ పోయిందట కదా నీది? మరి పోలీస్ కంప్లయింట్ ఇచ్చావా?" అడిగాడు అవధానులు.

అవధానులు శ్రీరాం వాళ్ళ కాలనీలోనే ఉంటాడు. మునిసిపల్ స్కూల్లో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నాడు. అడిగినా అడగకున్నా అన్నింటి లోనూ కలగజేసుకుని తనకు తోచిన ఉచిత సలహాలివ్వడం అతనికున్న అలవాటు.

"పోతే పోయిందిలే సార్! మళ్ళీ పోలీస్ కంప్లయింట్ ఎందుకు? మొదలే అది డొక్కు సైకిల్. దానికోసం పోలీస్ కంప్లయింట్ ఇవ్వడం, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం పరమ దండగ" శ్రీరాం పక్కనున్న అతని ఫ్రెండ్ చక్రి అన్నాడు.

చక్రికి అవధాన్లన్నా అతనిచ్చే ఉచిత సలహాలన్నా ఒళ్ళుమంట.

"అదేంమాటోయ్! మన వస్తువేదైనా పోతే పోలీస్ కంప్లయింట్ ఇవ్వడం బాధ్యతగల పౌరులుగా మన విధి. అందునా అలా కంప్లయింట్ ఇస్తే వాళ్ళు వాళ్లకు దొరికినవాటిలో నీకు ఏదో ఒక సైకిల్ ఇస్తారు కూడా" అన్నాడు అవధానులు.

"వద్దులేండి సార్" అన్నాడు శ్రీరాం కూడా.

★ ★ ★

"ఏరా శ్రీరాం! ఇందాక అవధానులు గారు వచ్చి వెళ్ళారు. ఆయన చెప్పినట్లు సైకిల్ పోయిన విషయం పోలీస్ కంప్లయింట్ ఇద్దామా?" అడిగాడు శ్రీరాంను అతని తండ్రి సుందరేశం.

"వద్దులే డాడీ" అన్నాడు శ్రీరాం విరక్తిగా.

"ఏంరా! మనంగానీ కంప్లయింట్ ఇస్తే దాని బదులు ఏదో ఓ సైకిల్ ఇస్తారటగా!" అన్నాడు సుందరేశం.

"మరో డొక్కు సైకిల్ ఇస్తారు"

"పోతే పోయిందిలేండి దరిద్రపు సైకిల్. మళ్లీ దానికోసం పోలీస్ కంప్లయింట్ వద్దూ, పాడూ వద్దూ. ఆ సైకిల్‌ను ఇన్నాళ్ళుగా తొక్కలేక పాపం బిడ్డ అల్లాడిపోయాడు. దరిద్రం వదిలిందనుకుని వాడికో కొత్త సైకిల్ కొనిపెట్టండి. ఈసారి మాత్రం కక్కుర్తి పడి ఏ సెకండ్‌హ్యాండ్ దరిద్రాన్నో కొనకుండా కొత్త సైకిల్ కొనివ్వండి. మొదలేవాడు ఎంసిఏ చదువుతున్నాడు. కాస్త లేటెస్ట్ మోడల్ సైకిల్‌ను కొనివ్వండి వాడికి" మధ్యలో కల్పించుకుని భర్తకు ఆర్డర్ వేసింది శ్రీరాం తల్లి దుర్గాంబ.

భార్య మాటలు కాదనే అలవాటులేని సుందరేశం శ్రీరాంకు కొత్త సైకిల్ కొనిపెట్టేందుకు వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశాడు.

శ్రీరాం రిలీఫ్‌గా గాలిపీల్చుకున్నాడు.

★ ★ ★

ఇది జరిగి రెండ్రోజులైంది.

ఆరోజు కాలేజీనుంచి నడిచి వస్తున్నాడు శ్రీరాం. పార్కు వీధి మలుపులో వినాయకుడి గుడి ఎదురుగా కన్పించింది అతనికి-అతన్ని గత దశాబ్దంగా మోసిన అతని సైకిల్. దాన్ని ఎత్తుకుపోయిన దొంగోడెవడో గానీ ఆ చెట్టు పక్కలెక్కడో ఉండే ఉండొచ్చు.

ఆ సైకిల్‌ను చూడగానే అతనికి అతని స్నేహితులు అన్నమాటలు గుర్తుకొచ్చాయి.

తండ్రి తనకు కొత్త సైకిల్ కొనిస్తానని మాట ఇచ్చిన విషయమూ గుర్తుకొచ్చింది.

వెంటనే తల తిప్పుకుని దాన్ని చూడనట్లు ముందుకు కదిలాడు.

★

